స్వచ్ఛందంగా తరలిన అధికారగణం

స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో
ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


కూరగాయల మార్కెట్‌లో చీపురు పట్టి శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: పరిసరాలతోపాటు మనసు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరుతుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమంలో భాగంగా తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో ఆదివారం చీపురు పట్టి ఎమ్మెల్యే, తదితరులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధులను తద్వారా దేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఆటవికమైన హింస విడనాడి ప్రశాంత వాతావరణంలో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, పద్మశాలి కార్పొరేషన్ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, గజ్జల కళావతి, గుమ్మళ్ల పద్మావతి, జయంతి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యం

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓతోపాటు సిబ్బంది ఆస్పత్రి లోపల, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీ సుబ్బారెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవలో విద్యార్థులు

పోరుమామిళ్ల : భారత ప్రధాని మోదీ పిలుపునకు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు స్పందించిన పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఆదివారం మేము సైతం అంటూ 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ప్రిన్సిపాల్ కె. రామిరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణ, పరిసరాలు, కళాశాల మైదానంలో కలుపు మొక్కలు తొలగించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు రంతుబాషా మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మన్యూనతా భావం లేకుండా పరిసరాలు శుభ్రం చేయడం వల్ల అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు.

అటవీ కార్యాలయంలో..

స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఫారెస్టు సిబ్బంది రేంజర్ వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో 'ఏక్ తారీఖ్ – ఏక్ గంట' నినాదంతో స్వచ్ఛత హి సేవలో భాగంగా శ్రమదానం చేశారు. ఆవరణలో ఉన్న కలుపు మొక్కలు తొలగించారు. చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరి వేశారు. పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీకృష్ణ, బీటు అధికారులు, సిబ్బంది, ప్రొటెక్షన్ ఫోర్స్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో శ్రమదానం

మైదుకూరు : మండలంలోని వనిపెంట జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల పరిసరాల్లో ఆదివారం స్వచ్ఛతా హి సేవలో భాగంగా సర్పంచ్ గౌస్ లాజం ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్షాద్, విద్యాకమిటీ చైర్మన్ కలాం, పంచాయతీ కార్యదర్శి రియాజ్‌లు పాల్గొన్నారు. అలాగే మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం స్వచ్ఛతా హి సేవలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పీవీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మూలవారిపల్లెలో...

బి.కోడూరు : మండలంలోని మూలవారిపల్లె మైక్రో వాటర్‌షెడ్ పరిధిలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమానిన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, యోగానందరెడ్డి, పెద్దుళ్ళపల్లె వాటర్‌షెడ్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మండల వాటర్‌షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ వేణుగోపాల్‌రెడ్డిలు హాజరై వాటర్‌షెడ్ నిధులతో ఏర్పాటు చేసిన చెరువు కట్ట పరిసర ప్రాంతాలను శుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ శివారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, నాయకులు వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, వాటర్‌షెడ్ సిబ్బంది జనార్దన్, రాధ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు ఆరోగ్య కేంద్రంలో..

చాపాడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఆదివారం వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో శుభ్రం చేశారు. కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పరిశుభ్రత చేశారు. వీరితో పాటు బీజేపీ నాయకులు పిచ్చి మొక్కలు తొలగించి పశుభ్రత చేశారు.

శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

బద్వేలు అర్బన్ : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఏట, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినీ విద్యార్థులతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అనారోగ్యం దరిచేరదని, ఆరోగ్యపరమైన సమాజంతోనే దేశం అభివృద్ధి చెందుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు.


పోరుమామిళ్లలో కలుపు తొలగిస్తున్న విద్యార్థులు


పోరుమామిళ్లలో శ్రమదానం చేస్తున్న సిబ్బంది



వనిపెంటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


మూలవారిపల్లెలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, తదితరులు

క్లుప్తంగా

ఇంటి ముంగిటే పించన్


రాజుపాళెం: పింఛను పంపిణీ చేస్తున్న వలంటీర్

రాజుపాళెం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పినట్లుగానే సూర్యుడు ఉదయించక ముందే.. వలంటీర్లు ఇంటి వద్ద సొమ్ముతో వాలిపోయారు. నిద్రపోతున్న వారిని లేపి మరీ డబ్బులు అందజేస్తుండటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మండల వ్యాప్తంగా 4791 పింఛన్ల పంపిణీ ఆరంభమైంది. ఎంపీడీఓ వెంకటరెడ్డితోపాటు ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

బీసీ సంక్షేమ సంఘం కమిటీ అధ్యక్షుడి నియామకం


నూతనంగా ఎన్నికైన బీసీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : కడప జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజుపాళెం మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రొద్దుటూరులో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకటరమణరాజు సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. మండల కన్వీనర్‌గా కె.రామసుబ్బయ్యయాదవ్, సంయుక్త కార్యదర్శిగా మహమ్మద్‌ఆలీ, కార్యదర్శిగా దూది వెంకటనారాయణ, ఉపాధ్యక్షులుగా మాబూషరీఫ్, ఎం.వెంకటసుబ్బయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రాజు, ముంగర రామచంద్రరాజు, శ్రీనివాసులు, పుల్లయ్య హాజరయ్యారు.

నియోజకవర్గ కమిటీ ఎన్నిక


జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రొద్దుటూరు నియోజకవర్గ నూతన కమిటీ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ నూతన బీసీ సంక్షేమ సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా పాణ్యం చిన్నసుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడిగా అగ్గారపు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా కె.నాగరాజు ఆచారి, కోశాధికారిగా తాటి శ్రీనివాసులును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, కృష్ణ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస ఆచారి, జిల్లా కార్యదర్శి బాల పెద్దయ్య, మేకల సుబ్బరామయ్య, వెంకటసుబ్బయ్య, గంగాధర్, జిల్లా కన్వీనర్ పాల్గొన్నారు.

అక్టోబర్ 1ని రాష్ట్ర అవతరణ దినంగా ప్రకటించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

ప్రొద్దుటూరు : అక్టోబర్ 1వ తేదీని ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంగా ప్రకటించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోకన్వీనర్ ఎస్పీ మహమూద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం ఏర్పడాలనే లక్ష్యంతో పొట్టి శ్రీరాములు పోరాటం చేశారని, దాని ఫలితంగా 1953 అక్టోబర్, 1న మద్రాసు నుంచి విడిపోయి కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ, బషీర్, జగదీష్, ఇస్మాయిల్, దర్బార్ బాషా, శ్రీను, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో వైద్య శిబిరాలు


చాపాడు దళితవాడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : మండలంలోని చాపాడు దళితవాడ, పల్లవోలు, ఖాదర్‌పల్లె, ఎస్.ఓబాయపల్లె, ద్వారకానగర్‌లలో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మహదేవ యాదవ్, ఆరోగ్య విస్తరణాధికారి మాచనూరు రాఘవయ్యలు జ్వరాలతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి జ్వర పీడితులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞానానికి నిలయాలు


బహుమతులు అందిస్తున్న డాక్టర్ మార్కారెడ్డి

పోరుమామిళ్ల : గ్రంథాలయాన్ని యువకులు, విద్యార్థులతో పాటు పెద్దలు కూడా సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మార్కారెడ్డి పిలుపిచ్చారు. ఆదివారం ఆయన గ్రంథాలయంలో మాట్లాడుతూ జ్ఞానానికి, విజ్ఞానానికి గ్రంథాలయం నిలయమని, గతానికి సంబంధించిన అంశాలతో పాటు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న రోజువారీ అంశాలు కూడా ఇక్కడ తెలుసుకోవచ్చన్నారు. రోజూ గ్రంథాలయానికి వెళ్లే అలవాటు చేసుకుంటే మానసికంగా జ్ఞానవంతులవుతారన్నారు. జనవిజ్ఞానవేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాశింవలి గత ఆదివారం నిర్వహించిన పోటీల్లో విజేతలతో పాటు, ఆ రోజు పాల్గొన్న అందరికీ మార్కారెడ్డి ద్వారా బహుమతులు పంపిణీ చేశారు. ప్రతి ఆదివారం విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాదాపీర్, లైబ్రేరియన్ అఫ్రిది, ఖాజావలి, ఖదీర్‌బాషా పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు


రెడ్డిపల్లిలో పోలీసుల కార్డెన్ సెర్చ్

అట్లూరు : గ్రామాల్లో ఎవరైనా సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కేసీ రాజు, గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం కార్డన్‌సెర్చ్‌లో భాగంగా అట్లూరు, గోపవరం, బి. కోడూరు పోలీసులతో కలసి కవాత్తు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ శివారులలో ఉన్న వరిగడ్డి వాములలో సోదించారు. ఈసందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చట్టాలకు లోబడి ఎవరి పనులు వారు చేసుకుంటూ ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరించినా, అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడినా శిక్షార్హులవుతారన్నారు. అలాగే మహిళల రక్షణ కోసం దిశా యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు ఘన నివాళి


ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళి అర్పిస్తున్న ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్‌కు స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వరి, గోధుమ నూతన వంగడాలను సృష్టించి దేశంలో ఆకలి బాధలను తీర్చిన శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ అని కొనియాడారు. కేంద్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి వరి, గోధుమ, బంగాళాదుంప జన్యువులపై పరిశోధనలు చేశారన్నారు. ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త నార్మన్ బోర్లాగ్‌తో కలిసి గోధుమ, వరి నూతన వంగడాలను సృష్టించడంలో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, మహేష్, డాక్టర్ వరుణ్ కుమార్‌రెడ్డి, మాధవరెడ్డి, సాయికుమార్, బాషా, హరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే మానసికోల్లాసం

కడప స్పోర్ట్స్: క్రీడల్లో రాణించడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. కడప నగరంలోని పి.వి.ఆర్.స్పోర్ట్స్ ఎరీనాలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లా స్థాయి పురుషుల డబుల్స్ విభాగం టోర్నమెంట్–23 ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ క్రీడలకు వయసుతో సంబంధం లేదన్నారు. గెలుపుతో వచ్చే ఉత్సాహం, క్రీడల్లో పాల్గొంటే కలిగే ఆనందం చక్కటి జ్ఞాపకాలన్నారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ రోజూ సాధన చేసే మధ్య వయసు క్రీడాకారులకు ఈ టోర్నమెంట్‌లు ఎంతో ఉత్సాహాన్నిస్తాయన్నారు. పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనా అధినేత విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

జొన్నకు పురుగు బెడద



రాజుపాళెంలో పురుగు ఉధృతికి జొన్న కర్రలకు రంధ్రాలు పడిన దృశ్యం, పంటను ఆశిస్తున్న పురుగు

రాజుపాళెం : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన జొన్న పంటలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట ఏపుగా పెరిగినా.. లోపల పురుగు రంధ్రాలు చేసింది. మండలంలోని గాదె గూడూరు, కూలూరు, టంగుటూరు, రాజుపాళెం, వెంగళాయపల్లె, కొర్రపాడు, పగిడాల, కుమ్మరపల్లె తదితర గ్రామాల్లో విస్తారంగా పంట సాగు చేశారు. పురుగు ఉధృతి పెరగడంతో ఆందోళనకు గురవుతున్నారు.

లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి

పురుగు ఉధృతి నియంత్రించేందుకు ఎకరా జొన్న పంటలో 6 నుంచి 8 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. థయోడికార్బ్ లీటరు నీటికి ఒక గ్రాము, బారాజైడ్ 1.5 ఎంఎల్ లీటరు నీరు లేదా డెలిగేట్ లీటరు నీటికి 1 ఎంఎల్ ఏదో ఒక మందు కలిపి పిచికారీ చేయాలి.

– శివరామకృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి

టీడీపీ నిరసన హాస్యాస్పదం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ శ్రేణులు శనివారం రాత్రి నిర్వహించిన నిరసన కార్యక్రమం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకుడు చంద్రబాబును జైలులో పెట్టారని టీడీపీ శ్రేణులు డ్రమ్స్ కొట్టడం, తప్పెట్లు వినిపించడం, కేకలు వేయడం, ప్లేట్లు కొట్టడం చేయడం సరికాదన్నారు. చంద్రబాబు జైలులో ఉంటే వీరు ఏమి చేయాలో తోచక అయోమయానికి గురవుతున్నారని ఎద్దేవా చేశారు. రామేశ్వరం తిరుణాల తరహాలో పీకలు మోగించడం, గండి ఆంజనేయస్వామి వద్ద దెయ్యం పట్టినట్లు ఊగడం చూసి జనం ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. భవిష్యత్తులోనైనా టీడీపీ నాయకులు నిరసన తీరు మార్చుకోవాలని సూచించారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

కాశినాయన : ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని బాలాయపల్లె గ్రామంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలు సైబర్ నేరగాళ్ళ బారిన పడకుండా చూసుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌లకు మెసేజ్‌లు పంపిస్తుంటారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి

ప్రొద్దుటూరు : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాలను రూ.10 వేలకు పెంచాలని సర్పంచ్ శివచంద్రారెడ్డి కోరారు. కొత్తపల్లె పంచాయతీలోని అమృతానగర్‌లో ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట


మత్స్యకారులకు పెన్షన్ అందజేస్తున్న మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

బద్వేలు అర్బన్ : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు మిరప్పల్లె వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బెస్తవీధిలోని సత్యమ్మ ఆలయం వద్ద పలువురు మత్స్యకారులకు మంజూరైన పెన్షన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ సర్టిఫికెట్ పొంది 50 ఏళ్ళు పైబడిన మత్స్యకారులకు ప్రభుత్వం రూ.2750 పెన్షన్ అందజేయడం గొప్ప విషయమన్నారు. అలాగే ఏదైనా కారణాల వలన చేపల ఎగుమతులు తగ్గినప్పుడు మత్స్యకారులు నష్టపోకుండా ఉండేందుకు ఫిష్ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అర్హులైన మత్స్యకారులకు ఫిష్ వెండింగ్ వాహనాలు అందజేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం సెక్రటరీ వెంకటయ్య, ఉపాధ్యక్షులు నాగేంద్ర, సభ్యులు రొయ్యలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించడం అందరి బాధ్యత


చర్చి ఆవరణలో సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న సంఘు సభ్యులు

బద్వేలు అర్బన్ : భావితరాలకు మార్గదర్శకులు సీనియర్ సిటిజన్స్ అని సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చి ప్రెస్బిటర్ చైర్మన్ రెవ. నందఐసక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఓల్డర్ పర్సన్‌ను పురస్కరించుకుని సంఘంలోని సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ ఉన్నతికి, సమాజాభివృద్ధికి పాటుపడిన సీనియర్ సిటిజన్స్‌ను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. వారి ఆలోచనలు, సూచనలు నేటితరం యువత పాటించాలని కోరారు. ముఖ్యంగా పెద్దలను భారంగా కాకుండా బాధ్యతగా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చర్చి గురువులు రెవ. ఆనందకుమార్, సంఘు సెక్రటరీ గొడ్డీటికిరణ్ ఎడ్వర్డ్, ట్రెజరర్ ఎం.సునీల్‌కుమార్, డయాసిస్ కౌన్సిల్ మెంబర్లు ప్రేమ్‌స్వరాజ్, దేవానందం, జ్యోతి, సుజాత, మహిళా విభాగం కార్యదర్శి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

గోపవరం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శనివారం బేతాయపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరానికి రోగులు పోటెత్తారు. వలంటీర్లు, వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్ళి ఆ కుటుంబంలో అనారోగ్యానికి గురైన వారిని గుర్తించారు. వివిధ వ్యాధులకు సంబంధించి ప్రత్యేక డాక్టర్ల ద్వారా వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి వైద్యశిబిరానికి అధిక సంఖ్యలో వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వివిధ వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించడంత పాటు అవసరమైన మందులను ఉచితంగా అక్కడే అందజేయడంతో శిబిరానికి వచ్చిన రోగులు హర్షం వ్యక్తం చేశారు. ఇంటింటి సర్వే మొదలైనప్పటి నుండి వైద్యశిబిరం పూర్తయ్యే వరకు మండల ప్రత్యేకాధికారి నాగరాజ, ఎంపీడీఓ చంద్రమౌళి ఏర్పాట్లను పరిశీలించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక సర్పంచ్‌తో పాటు మార్కెట్‌యార్డు డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శిబిరం వద్ద ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

పొగతాగడంతోనే గుండె జబ్బులు


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనాథరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : పొగతాగడంతోనే నాలుగు రెట్లు ఎక్కువగా గుండె జబ్బులు వస్తున్నాయని గుండె జబ్బు వ్యాధి నిపుణుడు డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆదివారం గుండె సమస్యలు, జాగ్రత్తలు, పరిష్కారాలు అంశంపై సదస్సు నిర్వహించారు. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారికి గుండె నొప్పి తెలియదని, ఆలస్యంగా గుర్తించడంతో హార్ట్ ఫెయిల్యూర్ జరిగే అవకాశం ఉందన్నారు. స్నానం చేసే సమయంలో ఆయాసం వచ్చినా పరీక్ష చేయించుకోవాలన్నారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు తీసుకోవాలని, రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్ చేయడంతో గుండె ఆరోగ్యంగా ఉంటుందన్నారు. తవ్వా సురేష్, పొలంకి శ్రీరాములు, కార్యదర్శి హేమంత్, దేవమణి, గోపినాథరెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రేపు బద్రిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

చాపాడు : మండలంలోని బద్రిపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు.

సీనియర్ న్యాయవాదికి సన్మానం


సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

ప్రొద్దుటూరు : 45 ఏళ్ల పూర్తి చేసుకున్న సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డిని స్థానిక జార్జి కార్నొనేషన్ క్లబ్‌లో ఆదివారం తోటి లాయర్లు, ఇతరులు ఘనంగా సన్మానించారు. రావుల రామమునిరెడ్డి మాట్లాడుతూ కొండారెడ్డి న్యాయవాదిగా 1979 నుంచి ఇప్పటి దాకా కోర్టులో ఎన్నో కేసులు వాదించి పేరు సంపాదించారన్నారు. ఈ కార్యక్రమంలో వై.రఘునాథరెడ్డి, శివశంకర్‌రెడ్డి, డి.దస్తగిరి, చంద్రశేఖర్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి పాల్గొన్నారు.